సాక్షి
ఆదిలాబాద్
ఆదివారం । 31 । ఆగస్టు । 2025



పలు రైళ్లు రద్దు

8లో▸

ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పట్టాలను సరిచేస్తున్న నేపథ్యంలో పలు రైళ్లను పాక్షికంగా రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు పేర్కొన్నారు.



అంబరాన్నంటిన క్రీడా సంబురం

ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా సంబురంలో భాగంగా జాతీయస్థాయిలో పతకాలు సాధించిన 15 మంది క్రీడాకారులు, కోచ్‌లను సన్మానించారు.

9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0/24.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అల్పపీడన ప్రభావంతో పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన మోస్తరు భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పోక్సోపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి ప్రభాకరరావు

కైలాస్‌నగర్: పోక్సో చట్టంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని జిల్లా జడ్జి కె.ప్రభాకర రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని కోర్టు ప్రాంగణంలో శనివారం విలేకరుల సమావేశంలో పోక్సో చట్టం వివరాలను వెల్లడించారు. ఈ కేసుల్లో విచారణ తీరు, నిబంధనలు, శిక్షల అమలు వంటి వాటిపై అవగాహన కల్పించారు. పిల్లలకు స్మార్ట్‌ఫోన్ కొనివ్వకూడదని, అలాగే వారి మానసిక స్థితి, ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని తల్లిదండ్రులకు సూచించారు. చట్టంపై అవగాహన కలిగి ఉన్నట్లైతే లైంగిక వేధింపులు, దాడుల నుంచి రక్షణ పొందవచ్చని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో మనోళ్ల సత్తా



పతకాలు సాధించిన వారితో కోచ్ రాకేశ్

ఆదిలాబాద్: జిల్లాకు చెందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటారు. మహబూబ్‌నగర్ వేదికగా గురువారం ప్రారంభమైన రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో మూడు పతకాలు కైవసం చేసుకున్నారు. రేస్ వాక్ విభాగంలో అండర్–20లో అడ్డం జస్వంత్, అండర్–18 విభాగంలో మేడి అన్వేష్ రజత పతకాలతో మెరువగా.. రాథోడ్ రషిక కాంస్య పతకం కైవసం చేసుకున్నట్లు శిక్షకులు వీజీఎస్ రాకేశ్, అరుణ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలవడంపై డీవైఎస్‌వో జక్కుల శ్రీనివాస్, పెటా అధ్యక్షుడు పార్థసారథి, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అడ్డి భోజారెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజేశ్ తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

హాజరుశాతం పెంచాలి



మాట్లాడుతున్న డీఐఈవో గణేశ్‌కుమార్

ఇంద్రవెల్లి: ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలని డీఐఈవో జాదవ్ గణేశ్‌కుమార్ అన్నారు. మండలంలోని లింగూడలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం అధ్యాపకులతో సమావేశమయ్యారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించడంతో పాటు సమయపాలన పాటించాలన్నారు. ఇందులో ప్రిన్సిపాల్ మారుతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

'ఓట్ల మార్పిడి'పై ఆర్డీవో విచారణ

ఇచ్చోడ: ఓట్ల మార్పిడి కేసుకు సంబంధించి ఆదిలాబాద్ ఆర్డీవో స్రవంతి శనివారం రాత్రి ఇచ్చోడ తహసీల్దార్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. 'సాక్షి'లో శనివారం 'ఓట్ల మార్పిడి కేసులో కొత్త మలుపు' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో అప్రమత్తమైన రెవెన్యూ శాఖ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రహస్యంగా విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. తహసీల్దార్ లాగిన్ నుంచి ఓట్ల మార్పిడి జరిగిన తేదీ, ఫోర్జరీ పత్రాలతో దరఖాస్తు చేసుకున్న తేదీలను పరిశీలించినట్లు సమాచారం. ఈ విషయంపై డిప్యూటీ తహసీల్దార్ రమేశ్‌ను 'సాక్షి' ఫోన్‌లో వివరణ కోరగా.. ఆర్డీవో వచ్చి వివరాలు సేకరించారని ఆయన పేర్కొన్నారు.

'మోడల్'లో స్పాట్ అడ్మిషన్లు

కైలాస్‌నగర్: జిల్లాలోని ఆయా మోడల్ స్కూళ్లలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు డీఈవో ఖుష్బూ గుప్తా ప్రకటనలో తెలిపారు. బజార్‌హత్నూర్ మోడల్ స్కూల్‌లో 152, జైనథ్‌లో 126, నార్నూర్‌లో 13, గుడిహత్నూర్‌లో 11 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించి ప్రవేశాలు పొందాలని సూచించారు.

ఇలవేల్పు.. నామమై

- ఇష్ట దైవాన్ని స్మరించేలా పేర్లు
- ప్రత్యేకత చాటుతున్న గ్రామాలు

ఇలవేల్పును నిత్యం స్మరించేలా పలు గ్రామాలు ప్రత్యేకతను చాటుతున్నాయి. సిరిచెల్మ ప్రాంతంలో మహిమ గల మల్లన్న.. కప్పర్లలో విష్ణు నారాయణుడు, కేస్లాపూర్‌లో నాగోబా నామం అధికంగా వినిపిస్తోంది. ఆయా ప్రాంతాల్లోని కుటుంబాల్లో ఎక్కువ మందివి తమ ఆరాధ్య దైవం పేర్లే ఉండడం గమనార్హం. అలాంటి వాటిపై ఈ వారం ఓ లుక్కేద్దాం.

– ఇచ్చోడ/తాంసి/ఇంద్రవెల్లి/జైనథ్



సిరిచెల్మ మల్లన్న ఆలయం

సిరిచెల్మలో.. మల్లన్న, మల్లేశ్‌లు

మండలంలోని సిరిచెల్మ మల్లన్న ఆలయం భక్తుల పాలిట కొంగు బంగారంగా నిలుస్తోంది. ఇలవేల్పుగా భావించే స్వామి నామంగా గ్రామంలో దాదాపు 200 మందికి పైగా పేర్లున్నాయంటే అతిశయోక్తి కాదు. మల్లన్న, మల్లేశ్, మల్లికార్జున్, మహేశ్, మహేశ్వరి, సోమన్న వంటివి ఎక్కువగా వినిపిస్తుంటాయి. చుట్టు పక్క గ్రామాల్లో సైతం ఇవే అధికంగా ఉండడం గమనార్హం.

- గ్రామంలో యాదవ కుటంబానికి చెందిన నేతుల మల్లేశ్ తాత ముత్తాతల పేర్లు కూడా మల్లన్న నామాలే. సంతానానికి ఇష్టదైవం నామం వచ్చేలా పేర్లు పెట్టాడు. పెద్ద కుమారుడు మల్లేశ్, రెండో కుమారుడు సోమేశ్, కూతురు పేరు మహేశ్వరి. వీరి సంతానం పేర్లు కూడా మణిశ్వరి, మనుతేజ, మల్లేశ్ కావడం గమనార్హం.
- సిరిచెల్మ ఆలయ పూజారుల పేర్లు సైతం పెద్ద మల్లేశ్, చిన్నమల్లేశ్,మహేశ్ కావడం ప్రత్యేకం.



మల్లేశ్ ఆయన కుమారులు మల్లేశ్, సోమేశ్, మనుమడు, మనుమరాలు మల్లేశ్, మణిశ్వరి

కేస్లాపూర్‌లో.. నాథ్‌లు

ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్‌లో మెస్రం వంశీయులు ఎక్కువ. వీరు తమ ఆరాధ్య దైవం నాగోబా వచ్చేలా సంతానానికి నామకరణం చేస్తున్నారు.ఆ పేర్ల చివరన నాథ్‌ను చేరుస్తున్నారు.

- ఇక్కడ మాజీ సర్పంచ్ మెస్రం నాగ్‌నాథ్ కాగా తన తనయుడి పేరు దేవ్‌నాథ్.
- ఆలయ పీఠాధిపతి వెంకట్‌రావ్ తన ఇద్దరు కుమారుల పేర్లు భద్రినాథ్, మంజునాథ్.
- మారు పటేల్ కుమారుల పేర్లు షేక్‌నాథ్, నాగ్‌నాథ్.
- వాల్గొండకు చెందిన కొట్నాక్ యశ్వంత్‌రావ్ ఇల దైవమైన జంగో.. లింగో పేర్లను కూతురు,కుమారుడికి పెట్టాడు.హీరాపూర్ గ్రామానికి చెందిన కుమ్రం మాదవ్ తన ఇద్దరి కుమారుల పేర్లు జంగో..లింగో కావడం గమనార్హం.
- ఇక జైనథ్‌లో దుమాల రాములు తన ఇద్దరి కుమారుల పేర్లు పెద్ద దేవన్న, చిన్న దేవన్న.



కప్పర్లలో.. నారాయణలే అధికం

తాంసి మండలం కప్పర్లలో అధికంగా నారాయణ పేర్లే ఉన్నాయి. స్థానికంగా విష్ణు భక్తులు ఎక్కు వగా ఉండటంతో ఈ నామకరణం చేస్తున్నట్లు తెలుస్తోంది. అంతే కాదండోయ్ ఈ గ్రామానికి మరో ప్రత్యేకత ఉంది. ఇక్కడ సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీ పదవులు పొందిన వారు ఎక్కువగా నారాయణ నామం కల వారే. గ్రామానికి చెందిన కొడాల నారాయణ ఎంపీపీతో పాటు జెడ్పీటీసీగానూ పనిచేశారు.



కప్పర్ల గ్రామ ముఖ చిత్రం

ఆ తరువాత ఇద్దరు నారాయణలు సర్పంచ్‌గా కొనసాగారు. ఇక్కడ ప్రధాన పార్టీ నాయకుల పేర్లు సైతం నారాయణలే కావడం విశేషం.

పల్లెటికల్ హీట్

- స్థానిక పోరుకు సర్కారు గ్రీన్‌సిగ్నల్
- మొదలైన ఆశావహుల యత్నాలు
- రిజర్వేషన్ల పరిమితి ఎత్తివేతపై ఉత్కంఠ

జిల్లాలో స్థానిక సంస్థల వివరాలు
జెడ్పీటీసీ స్థానాలు : 20
ఎంపీటీసీ స్థానాలు : 166
ఎంపీపీ స్థానాలు : 20
గ్రామ పంచాయతీలు : 473
వార్డులు : 3870
పల్లె ఓటర్లు : 4,49,979

కైలాస్‌నగర్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతుంది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించిన రాష్ట్ర కేబినెట్‌లో ఎన్నికల నిర్వహణకు ఆమోదం తెలిపింది. అయితే యంత్రాంగం ఇప్పటికే అవసరమైన కసరత్తు పూర్తి చేసింది. ఈ క్రమంలో ఎప్పుడైనా షెడ్యూల్ విడుదలయ్యే అవకాశముంది. మంత్రివర్గ తాజా నిర్ణయం



తో పల్లె రాజకీయం ఒక్కసారిగా వేడెక్కనుంది. స్థానిక బరిలో నిలిచేందుకు ఆసక్తి కనబరుస్తున్న ఆశావహుల్లో జోష్ కనిపిస్తుంది.ఓటర్లను ప్రసన్నం చేసుకునే యత్నాలను వారు ముమ్మరం చేయనున్నారు.

ఇక పల్లెల్లో సందడి ..

పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసి దాదాపు ఏడాదిన్నర కావస్తుండగా, జెడ్పీ, మండల పరిషత్ పాలకవర్గాల గడువు ముగిసి ఏడాది దాటింది. ప్రస్తుతం వీటిలో ప్రత్యేకాధిరుల పాలన సాగుతుంది. అయితే పల్లె ఎన్నికలపై రాజకీయ పార్టీలతో పాటు ఆశావహులు గంపెడాశతో ఎదురుచూస్తున్నారు. ఈ మేరకు వారి నిరీక్షణకు తెరదించేలా సెప్టెంబర్ లోపే నిర్వహిస్తామంటూ మంత్రివర్గం నిర్ణయించడంతో అంతా అలర్ట్ అవుతున్నారు. ఆశావహులు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ప్రజల మద్దతు కూడగట్టే ప్రయత్నాలపై ఫోకస్ పెంచారు. ఇక పల్లెల్లో రాజకీయ హడావుడి పెరగనుంది.

రిజర్వేషన్లపై ఉత్కంఠ ..

స్థానిక ఎన్నికలు నిర్వహించడంతో పాటు ఇప్పటి వరకు ఉన్న రిజర్వేషన్లపై ఉన్న పరిమితి సైతం ఎత్తివేస్తామని మంత్రివర్గం నిర్ణయించడంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. పంచాయతీ రాజ్ చట్టం సవరించి ప్రత్యేక జీవో ద్వారా బీసీలకు 42శాతం రిజర్వేషన్లను తామిచ్చిన మాట ప్రకారం అమలు చేస్తామని నిర్ణయించడం ప్రాధాన్యత నెలకొంది. ఈ మేరకు అమలైతే జిల్లాలో ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లు మారనున్నాయి. దీంతో జెడ్పీటీసీ, ఎంపీటీసీ మొదలుకుని సర్పంచ్, వార్డు మెంబర్ల వరకు ఎలాంటి రిజర్వేషన్ వస్తుందనే దానిపై రాజకీయ పార్టీలతో పాటు ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. పోటీకి సన్నద్ధమవుతున్న వారు రిజర్వేషన్ తమకే అనుకూలంగా వస్తుందనే భావనతో ముందుకు సాగుతున్నారు. ఇప్పటి వరకు పట్టించుకోని వారిని సైతం ఆప్యాయంగా పలుకరిస్తూ యోగాక్షేమాలు తెలుసుకుంటున్నారు. యువతకు విందులు ఏర్పాటు చేస్తున్నారు. తమను గెలిపిస్తే గ్రామానికి అవసరమైన పనులన్నీ చేసి పెడుతామనే నమ్మకం కల్పించేలా గట్టిగా ప్రయత్నిస్తున్నారు.

ప్రశాంతంగా సీసీల బదిలీ ప్రక్రియ

కైలాస్‌నగర్: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) పరిధిలో జిల్లాలోని వివిధ మండలాల్లో పనిచేస్తున్న కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, మాస్టర్‌బుక్ కీపర్, పారాలీగల్, మండల సమాఖ్య క్లస్టర్ కోఆర్డినేటర్ల బదిలీల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. 17 మండలాల పరిధిలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న 107 మంది సీసీలకు కలెక్టర్ రాజర్షిషా ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఖాళీల ఆధారంగా సీనియారిటీ ప్రకారం స్థానచలనం కల్పించారు. ఇద్దరు సీసీలు సస్పెన్షన్‌లో ఉండటంతో వారికి ఈ బదిలీల్లో అవకాశం కల్పించలేదు. కాగా, బదిలీ పొందిన వారంతా సెప్టెంబర్ 1న కేటాయించిన క్లస్టర్లలో విధుల్లో చేరాల్సి ఉంటుంది. కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ సలోని చాబ్రా, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి రాథోడ్ రవీందర్, అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి జాదవ్ గోవింద్, హెచ్‌ఆర్ మేనేజర్ టి. శ్రీనివాస్, ఏపీఎంలు స్వామి, షద్దోద్దీన్ పాల్గొన్నారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

సాత్నాల: విద్యార్థులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా భోరజ్ మండలం గిమ్మ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యాయామం, సమతుల ఆహారం, పరిశుభ్రత, తగినంత నిద్రతో ఆరోగ్యకరమైన జీవనశైలి అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ సలోని చాబ్రా, తహసీల్దార్ రాథోడ్ రాజేశ్వరి, ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, ఈజీఎస్ ఏపీవో సుభాషిని, ప్రధానోపాధ్యాయులు పద్మజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహా వినాయకుడికి ఎంపీ, కలెక్టర్ పూజలు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని కుమార్‌పేట్‌లో కుమార్ జనతా గణేశ్‌మండలి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన 54 అడుగుల మహావినాయకుడిని ఎంపీ నగేశ్, కలెక్టర్ రాజర్షి షా, ఆయన సతీమణి టీజీఎస్పీ రెండో బెటాలియన్ కమాండెంట్ నితికా పంత్ శనివారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే రిమ్స్ మహాగణపతిని కలెక్టర్ దంపతులు దర్శించుకుని పూజలు చేశారు. వారి వెంట తోట పరమేశ్వర్, ప్రమోద్ కుమార్, ఆదిత్య ఖండేశ్కర్, తదితరులున్నారు.

రవాణా చెక్‌పోస్టుల తొలగింపు



భోరజ్ చెక్‌పోస్టు (ఫైల్)

- జీవో జారీ చేసిన ప్రభుత్వం
- సిబ్బందికి మొబైల్ స్క్వాడ్ బాధ్యతలు
- ఆరు నెలల పాటు నిర్వహించాలని ఆదేశం

సాక్షి, ఆదిలాబాద్: సరిహద్దులో రవాణాశాఖ చెక్‌పోస్టులను తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. జీవో ఎంఎస్ నంబర్ 58ని ఈ నెల 28న జారీ చేసింది. తదనుగుణంగా సరిహద్దుల్లోని రవాణా చెక్‌పోస్టులను తొలగించారు. అయితే ఇప్పటికే అక్కడ బాధ్యతలు నిర్వర్తిస్తున్న సిబ్బందికి ఆరు నెలల పాటు మొబైల్ స్క్వాడ్ విధులు కేటాయించారు. ప్రధానంగా పన్ను చెల్లించకుండా రాష్ట్రంలోకి సరుకు వాహనాలు రాకుండా చూడటమే వీరి విధి. అంతే కాకుండా కేంద్ర ప్రభుత్వం ద్వారా ఇప్పటికే అమల్లో ఉన్న ఆన్‌లైన్ వాహన్ సాఫ్ట్‌వేర్‌ను రాష్ట్రంలో కూడా అమల్లోకి తీసుకువచ్చారు. తద్వారా ఇప్పటి వరకు ఆయా చెక్‌పోస్టుల్లో లభించే వివిధ రకాల సేవలను ఇకపై ఆన్‌లైన్‌లో జారీ చేసేలా ఈ సాఫ్ట్‌వేర్ ఉపయోగపడనుంది. అలాగే వాహన డ్రైవర్లకు అవగాహన కల్పించేందుకు గాను మొబైల్ స్క్వాడ్ సరిహద్దులో ఆరు నెలల పాటు సేవలందించనుంది. ఆ శాఖ కమిషనర్ తదుపరి ఆదేశాల మేరకు సిబ్బంది సేవలపై స్పష్టత రానుంది.

ఉమ్మడి జిల్లాలో...

ఉమ్మడి జిల్లాలో ఆదిలాబాద్‌లో భోరజ్, ఆసిఫాబాద్‌లో వాంకిడి, నిర్మల్‌లోని భైంసాలో మహారాష్ట్రకు సరిహద్దుగా రవాణా శాఖ చెక్‌పోస్టులు ఇప్పటి వరకు సేవలందించాయి. ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో ఆయా చెక్‌పోస్టులను తొలగించారు. అయితే మొదటి ఆరు నెలలు మొబైల్ స్క్వాడ్ సిబ్బంది ఇక్కడ విధులు నిర్వహిస్తారు. పన్ను చెల్లించని సరుకు వాహనాలను రాష్ట్రంలోకి రాకుండా చూస్తారు. ఇదిలా ఉంటే భోరజ్‌లో 10 మంది, వాంకిడిలో ఎనిమిది, భైంసాలో ముగ్గురు సిబ్బంది సేవలందిస్తున్నారు. తాజాగా వారిని మొబైల్ స్క్వాడ్ డ్యూటీలోకి మార్చారు.

సేవలు ఇలా...

రవాణాశాఖ పరంగా చెక్‌పోస్టుల్లో అందించే సేవలను ఇకపై వాహన్ సాఫ్ట్‌వేర్ ద్వారా స్వచ్ఛంద పన్ను ఆన్‌లైన్‌లో చెల్లించేలా డ్రైవర్లకు అవగాహన కల్పించాలి. తాత్కాలిక పర్మిట్, వాలంటరీ ట్యాక్స్, స్పెషల్ పర్మిట్ ఈ సేవలను ప్రజలు ఇకపై ఆన్‌లైన్ ద్వారా పొందాల్సి ఉంటుంది.



భోరజ్ చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ సేవల బోర్డు

'భోరజ్'ను తొలగించాం



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు భోరజ్ రవాణా శాఖ చెక్‌పోస్టును తొలగించాం. సిబ్బందికి మాత్రం ఆరు నెలల పాటు మొబైల్ స్క్వాడ్ విధులు అప్పగించాం. వాహనదారులకు వాహన్ సాఫ్ట్‌వేర్‌పై అవగాహన కల్పిస్తారు. తదుపరి ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– రవీందర్ కుమార్, ఉప రవాణా అధికారి, ఆదిలాబాద్

నవరాత్రోత్సవ ఏర్పాట్లపై అసంతృప్తి


- 'శాంతి' సమావేశం బహిష్కరించిన ఉత్సవ సమితి ప్రతినిధులు

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలో గణేశ్ నవరాత్రోత్సవ ఏర్పాట్ల నిర్వహణపై హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన సమావేశాన్ని బహిష్కరించి అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఆర్డీవో స్రవంతి ఆధ్వర్యంలో ఆయా మండపాల నిర్వాహకులు, హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులు, వివిధ మతాల పెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. యంత్రాంగం తీసుకుంటున్న చర్యలను ఆమె వివరించారు. మున్సిపల్, విద్యుత్ శాఖల అధికారులు తాము చేపట్టిన ఏర్పాట్లను వివరిస్తుండగా ఉత్సవ సమితి ప్రతినిధులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సమావేశాల్లో చెప్పిన అంశాలు కాగితాలకే పరితమవుతున్నాయే తప్ప సౌకర్యాల కల్పనలో అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వేడుకల ప్రారంభానికి ముందు నిర్వహించిన సమావేశంలో తాము ప్రస్తావించిన ఏ ఒక్క సమస్యను పరిష్కరించలేని పేర్కొంటూ సమావేశాన్ని బహిష్కరించి బయటకు వెళ్లిపోయారు. ఆర్డీవో నచ్చజెప్పే ప్రయత్నం చేసినా పట్టించుకోలేదు. ఈ సందర్భంగా ఉత్సవ సమితి అధ్యక్షుడు హన్మాండ్లు మాట్లాడుతూ.. ఉత్సవాల ఏర్పాట్లకు సంబంధించి అధికారుల నుంచి సహకారం కరువైందన్నారు. చాలా చోట్ల చెట్ల కొమ్మలు తొలగించకపోవడంతో పలు విగ్రహాలు దెబ్బతిన్నాయని, అలాగే రోడ్ల గుంతలు పూడ్చలేదని, వీధి దీపాలు సైతం వెలగడం లేదన్నారు. రూ.16లక్షల నిధులు కేటాయించినట్లు చెబుతున్నా వాటిని ఎక్కడ, ఎలా ఖర్చు చేస్తున్నారో తెలియడం లేదన్నారు. 1న కలెక్టర్, ఎస్పీల సమక్షంలో జరిగే సమావేశం వరకు సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



సమావేశాన్ని బహిష్కరించి బయటకు వస్తున్న ఉత్సవ సమితి ప్రతినిధులు

కేడెట్లకు ఫైరింగ్‌లో శిక్షణ




కేడెట్లకు ఫైరింగ్‌లో శిక్షణ ఇస్తున్న అధికారి

ఆదిలాబాద్: జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో కొనసాగుతున్న ఎన్‌సీసీ 32టీ బెటాలియన్ శిక్షణ శిబిరం మూడో రోజుకు చేరింది. కేడెట్లకు శనివారం మ్యాప్ రీడింగ్, ఫైరింగ్‌పై శిక్షణ ఇచ్చారు. శిబిరం పది రోజుల పాటు కొనసాగనుంది. ఇందులో కల్నల్ వీపీ సింగ్, లెఫ్టినెంట్ కల్నల్ అరవింద్ కిచ్చర్, కెప్టెన్ జగ్రామ్, ఎస్ఎం భగీరథ, ఏఎన్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టంభనకు తెర

- ఫోన్‌లో కాంట్రాక్టర్లతో చర్చించిన విద్యుత్ శాఖ సీఎండీ
- సమస్యల పరిష్కారానికి హామీ
- ఆందోళన విరమించి.. పనుల్లోకి కాంట్రాక్టర్లు


కైలాస్‌నగర్: విద్యుత్‌శాఖలో ఏర్పడిన ప్రతిష్టంభనకు తెరపడింది. పెండింగ్ బిల్లుల విషయంలో ఓ అధికారి తీరు నిరసిస్తూ కాంట్రాక్టర్లు పనులు చేపట్టకుండా ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. ప్రస్తుతం భారీ వర్షాల కారణంగా అత్యవసర పనులకు ఇక్కట్లు తలెత్తుతున్న క్రమంలో ఆ శాఖ సీఎండీ వరుణ్‌రెడ్డి నేరుగా రంగంలోకి దిగారు. ఫోన్ ద్వారా కాంట్రాక్టర్ల సంఘం అధ్యక్షుడు ప్రకాశ్‌తో శనివారం ఉదయం చర్చలు జరిపారు. పెండింగ్ బిల్లులతో పాటు ఇతర అంశాలన్నీ పరిశీలించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని సీఎండీ పేర్కొన్నట్లు కాంట్రాక్టర్లు తెలిపారు. ఈ మేరకు ఆందోళన విరమించినట్లు పేర్కొన్నారు. శనివారం ఉదయం ఆదిలాబాద్ డీఈ ఈదన్నను కలిసి తమ నిర్ణయాన్ని వెల్లడించినట్లు తెలిపారు. కాగా విద్యుత్‌శాఖలో కాంట్రాక్టర్ల నిరసన కారణంగా ఏర్పడిన పరిస్థితులను వివరిస్తూ 'ముదిరిన వివాదం', 'ప్రతిష్టంభన' శీర్షికన 'సాక్షి'లో వరుస కథనాలు ప్రచురించిన విషయం విదితమే. ఈ మేరకు స్పందించిన ఆ శాఖ సీఎండీ నేరుగా రంగంలోకి దిగి కాంట్రాక్టర్లతో చర్చించడం గమనార్హం.



డీఈ ఈదన్నతో కాంట్రాక్టర్లు

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

కైలాస్‌నగర్: గిరిజన మహిళా రైతు మృతికి కారకులైన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సాత్నాల మండలం పలాయి తండా వాసులు శనివారం ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. పోలీసుల సమాచారంతో వారి వద్దకు వచ్చిన ఆర్డీవో స్రవంతికి సమస్యను వివరించారు. గ్రామానికి చెందిన చౌహాన్ కమలబాయి సర్వేనంబర్ 102లో ఆరెకరాల వ్యవసాయ భూమిని 1986లో ఇతర కులస్తుల వద్ద కొనుగోలు చేసినట్లు చెప్పారు. అయితే ఆ భూమి విక్రయించిన వ్యక్తి మనుమండ్లు ఆరుగురు అది తమ భూమి అంటూ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. దీంతో ఆర్ఐ, సర్వేయర్ ఎలాంటి నోటీసు ఇవ్వకుండా సదరు రైతును విచారించేందుకు వచ్చారు. దీంతో భయాందోళనకు గురైన రైతు బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురై మృతి చెందినట్లు తెలిపారు. అధికారుల అత్యుత్సాహంతోనే రైతు మృతి చెందినట్లు ఆరోపించారు. బాధిత కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు భూమిని సాగు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందులో లంబాడా జేఏసీ నాయకులు పాల్గొన్నారు.



ఆర్డీవోకు వివరిస్తున్న గ్రామస్తులు

క్లుప్తంగా

గంజాయి సాగు చేసిన ఒకరి రిమాండ్



నిందితుడిని చూపిస్తున్న సీఐ వెంకటేశ్వర్‌రావ్

బజార్‌హత్నూర్: మండలంలోని గంగాపూర్‌కు చెందిన బాలేరావ్ అనిల్ టెంబి గ్రామ శివారులో గల తన పత్తి చేనులో 60 గంజాయి మొక్కలు పెంచారు. విషయం తెలుసుకున్న బోథ్ సీఐ వెంకటేశ్వర్‌రావ్ శనివారం ఎస్సై సంజయ్ కుమార్‌తో కలిసి వెళ్లి గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు అనిల్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. గంజాయి మొక్కల విలువ రూ.3 లక్షలు ఉంటుందన్నారు.

విద్యుత్ కేబుల్ చోరీ

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా ఎస్సార్పీ 3 గని సమీపంలోని సబ్‌స్టేషన్‌కు చెందిన సుమారు 60 మీటర్ల కాపర్ విద్యుత్ కేబుల్ చోరీకి గురైంది. శుక్రవారం రాత్రి దొంగలు సబ్‌స్టేషన్ నుంచి గనికి సరఫరా అయ్యే కేబుల్‌ను కత్తిరించి ఎత్తుకెళ్లారు. దీని విలువ రూ.లక్ష వరకు ఉంటుందని కార్మికులు పేర్కొంటున్నారు. కేబుల్ కట్ చేయడంతో గనికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వర్క్‌షాప్ విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో చోరీ విషయం బయటపడింది. ఈ విషయమై ఏరియా సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డిని సంప్రదించగా దొంగతనం జరిగినట్లు ధ్రువీకరించారు. దీనిపై ఇంకా ఫిర్యాదు రాలేదని శ్రీరాంపూర్ పోలీసులు తెలిపారు.

మోసగించి డబ్బులు కాజేసిన వ్యక్తి అరెస్ట్

ఉట్నూర్‌రూరల్: మోసగించి డబ్బులు కాజేసిన మండల కేంద్రంలోని బోయవాడకు చెందిన ఠాగూర్ విజయ్ సింగ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఉట్నూర్ సీఐ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంవైవీ3ఏడీఎస్ అప్లికేషన్‌లో జాయిన్ అయి యాడ్ చూస్తూ మీకు డబ్బులు వస్తాయని ఆశచూపించి బోయవాడకు చెందిన అలీ వద్ద రూ.1,20,000, రమేశ్ వద్ద రూ.1,20,000 తీసుకుని మోసగించినట్లు ఆయన పేర్కొన్నారు. బాధితులెవరైనా ఉంటే ఉట్నూర్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి సంప్రదించాలని సూచించారు. ఆన్‌లైన్ గేమింగ్, మార్కెటింగ్ తదితర వాటికి లొంగి మోసపోవద్దన్నారు.

మందమర్రి ఏరియా జీఎంగా రాధాకృష్ణ



రాధాకృష్ణ

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియా జీఎంగా కార్పొరేట్ ఎస్టేట్ జీఎంగా విధులు నిర్వహిస్తున్న ఎన్.రాధాకృష్ణను నియమిస్తూ సింగరేణి యాజమాన్యం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు మందమర్రి ఏరియాలో జీఎంగా విధులు నిర్వహిస్తున్న దేవేందర్ 45 రోజుల పాటు సెలవులో వెళ్లారు. రాధాకృష్ణను డైరెక్టర్ (పీఅండ్‌పీ)కు రిపోర్ట్ చేయాలని ఉత్తర్వులో పేర్కొన్నారు.

ఆలోచన.. ఆవిష్కరణ

- కాగజ్‌నగర్‌లో విభాగ్ స్థాయి గణిత విజ్ఞాన మేళా
- ఆలోచింపజేసిన చిన్నారుల ప్రాజెక్టులు
- శాస్త్రీయ దృక్పథం పెంచుకోవాలని అతిథుల సూచన



బహుమతులు అందుకున్న విద్యార్థులు

కాగజ్‌నగర్‌టౌన్: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు జ్ఞాన విజ్ఞాన మేళాలు ఎంతగానో ఉపయోగపడతాయని శ్రీ సరస్వతి శిశుమందిర్ మంచిర్యాల జిల్లా విభాగ్ కార్యదర్శి దహెగాం గోవింద్‌రావు అన్నారు. శనివారం కాగజ్‌నగర్‌లోని ఆదర్శనగర్ శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో విభాగ్ స్థాయి గణిత జ్ఞాన విజ్ఞాన మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులు కొత్త ప్రయోగాలు, ఆవిష్కరణలకు ఊతమిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగివున్న శాస్త్ర సాంకేతిక ప్రతిభను వెలికితీయడంలో గణిత జ్ఞాన విజ్ఞాన మేళాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. అనంతరం, విద్యార్థులు ప్రదర్శించిన ఆవిష్కరణలను తిలకించి పలువురిని ఆలోచింపజేసేలా ఉన్నాయని ప్రశంసించారు. మేళాలో మంచిర్యాల, ఆసిఫాబాద్, బెల్లంపల్లి, గోదావరిఖని, శ్రీరాంపూర్, పెద్దపల్లి నుంచి శిశువర్గ, బాలవర్గ, కిశోరవర్గల నుంచి విద్యార్థులు 236 మంది హాజరై ఆవిష్కరణలను ప్రదర్శించారు. ఇందులో ప్రతిభ కనబర్చిన వారు రాష్ట్రస్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి మేళాకు ఎంపిక

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని సరస్వతీ శిశు మందిర్ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి విజ్ఞాన మేళాకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వర్‌రావు తెలిపారు. శనివారం కాగజ్‌నగర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి విజ్ఞాన మేళాలో శార్వాణి, వెంకట రత్న, చరణ్, సాకేత్, హరిచరణ్, దివ్య, జశ్వంత్, నిహారిక, విక్రమ్, శ్రీనిధి ఉత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు అందుకున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు సెప్టెంబర్ 3నుంచి 5వ తేదీ వరకు కామారెడ్డిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి విజ్ఞాన మేళాలో పాల్గొంటారని వివరించారు.

బొగ్గుతో విద్యుత్ ఉత్పత్తి



బొగ్గును వినియోగించి విద్యుత్‌ను ఎలా తయారు చేయాలి? తయారైన విద్యుత్‌ను ఎలా స్టోరేజ్ చేయాలనే అంశంపై ప్రాజెక్టు తయారు చేశా. దీని ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ విద్యుత్ ఉత్పత్తి చేసి స్టోర్ చేసుకోవచ్చు.

– వి.సాన్విక, 7వ తరగతి, గోదావరిఖని

జియోమెట్రిక్ షేప్స్



గణితంలోని జియోమెట్రిక్ షెప్స్ మానవ జీవితంలో వినియోగించే ప్రతీ పనిలో ఉంటాయి. ఇంటి నిర్మాణాలు త్రిభుజాకారం, దీర్ఘచతురస్రాకారం, చతురస్రాకారం, గోలం, తదితర ఆకారాల్లో ఉంటాయి. ప్రతీ దానిలో గణితం ఆకారాలు ఇమిడి ఉన్నాయి.

– శ్రీ వైష్ణవి, 3వ తరగతి, ఆదర్శనగర్, కాగజ్‌నగర్

మోడల్ బేస్డ్ ఆన్ అగ్రికల్చర్



కాలానుగుణంగా వ్యవసాయం ఎలా చేయాలో తెలిపే మోడల్ బేస్డ్ ఆన్ అగ్రికల్చర్ ప్రాజెక్టును తయారు చేశా. మట్టి, వివిధ రకాల ధాన్యాలను ఎంచుకుని మట్టిలో కాలానుగుణంగా ఏవిధంగా వేయాలో తెలిపే ప్రయోగం తయారుచేశా. ఇందుకు సహకరించిన ఆచార్యులకు ధన్యవాదాలు.

– వొడ్డపల్లి ఆయూష్, 4వ తరగతి, ద్వారకానగర్, కాగజ్‌నగర్

వర్షపు నీటిని నిల్వ చేసుకునేలా..



ఇంటి ఆవరణలో, ఇంటి పైకప్పుపైన ట్యాంక్ ఏర్పాటు చేసుకోవాలి. వర్షపు నీరు అందులో స్టోరేజీ అయ్యేలా చూసుకోవాలి. స్టోరేజ్ అయిన నీటిని మూడు పద్ధతుల్లో వేరు చేసి ఇంటి అవసరాలకు వాడుకునేలా ప్రాజెక్టు చేశా.

– ఈ.సాకేత్, కాగజ్‌నగర్ ,4వ తరగతి

సంతానం కలుగడంలేదని ఉపాధ్యాయురాలు ఆత్మహత్య



కవిత (ఫైల్)

కాగజ్‌నగర్‌టౌన్/కౌటాల: సంతానం కలుగడంలేదనే మనస్తాపంతో ఉపాధ్యాయురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల మేరకు కాగజ్‌నగర్ పట్టణంలోని ఎల్లగౌడ్ తోటకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు మిడిదొడ్డి కవిత (41)కు ఐదేళ్ల క్రితం చరణ్‌తో వివాహమైంది. సదరు ఉపాధ్యాయురాలు కౌటాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ టీచర్‌గా విధులు నిర్వహిస్తోంది. ఇప్పటి వరకూ సంతానం కలుగకపోవడంతో పాటు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఆరోగ్యం నయం కాకపోవడంతో పాటు సంతానం లేకపోవడంతో మనస్తాపం చెందింది. శుక్రవారం రాత్రి భర్త బయటకు వెళ్లిన సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. బయట నుండి వచ్చిన భర్త పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి అన్న రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జ్వరంతో బాలుడు మృతి



సీతారాం (ఫైల్)

తిర్యాణి: జ్వరంతో బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు గిన్నెదరి గ్రామానికి చెందిన ఆడ రాము కుమారుడు సీతారాం(15) పదిహేను రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో చికిత్స అందించినా తగ్గకపోవడంతో మూడు రోజుల క్రితం మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందాడు. మూడు రోజుల వ్యవధిలోనే మండలంలోని ఇద్దరు పిల్లలు జ్వరంతో చనిపోవడంతో ప్రజల్లో భయాందోళన నెలకొంది.

సింగరేణి పరిరక్షణకు కలిసిరావాలి

- హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్

శ్రీరాంపూర్: సింగరేణిని పరిరక్షించుకోవడానికి కార్మికులంతా కలిసి రావాలని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ పిలుపునిచ్చారు. శనివారం నస్పూర్ కాలనీలోని గోదావరి ఫంక్షన్ హాల్‌లో హెచ్‌ఎంఎస్ 26వ ద్వైపాక్షిక మహాసభలు ప్రారంభమయ్యాయి. యూనియన్ జెండా ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణిలో కొత్త గనులు రాకపోవడం వల్ల సంస్థ భవిష్యత్తు ప్రమాదంలో పడిందన్నారు. నూతన గనులు వస్తేనే సింగరేణికి భవిష్యత్ ఉంటుందని, దీని కోసం కార్మికవర్గం పోరాడాలన్నారు. కార్మికుల హక్కుల సాధనకోసం తెలంగాణ జాగృతి నాయకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో కలిసి పనిచేస్తున్నామన్నారు. కవితను యూనియన్ గౌరవ అధ్యక్షురాలిగా నియమించుకోబోతున్నట్లు తెలిపారు. ఆదివారం జరిగే సభలో నూతన కమిటీ ఎన్నికలు, పలు తీర్మానాలు చేస్తామన్నారు. సమావేశంలో యూనియన్ సింగరేణి విభాగం అధ్యక్షుడు తిప్పారపు సారయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ గడిపల్లి కృష్ణప్రసాద్, శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు అనిల్ రెడ్డి, కార్యదర్శి పానగంటి అశోక్, 12 ఏరియాల ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, సెంట్రల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ పునరుద్ధరించాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ జిల్లా కన్వీనర్ వి.ప్రభాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో సంఘ భవనంలో పాత పెన్షన్ సాధన పోరాట సభ పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలనే ఉద్దేశంతో సెప్టెంబర్ 1న ఐడీవోసీ కార్యాలయంలో నిర్వహించే సభను విజయవంతం చేయాలని కోరారు. 2004 సెప్టెంబర్1 తర్వాత నియమితులైన ప్రభుత్వ ఉద్యోగుల పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1న మధ్యాహ్న భోజన విరామంలో ప్రభుత్వ ఉద్యోగులు కలెక్టరేట్‌లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ గౌరవ అధ్యక్షుడు ఎంసీ.లింగన్న, గెజిటెడ్ ఉద్యోగుల సంఘం కార్యదర్శి రమేశ్, ఉపాధ్యాయ ఉద్యోగ సంఘం నాయకులు మురళీమనోహర్‌రెడ్డి, జుట్టు గజేందర్, రవికాంత్, భూమన్న యాదవ్, లక్ష్మణ్, అశోక్, నాలుగో తరగతి ఉద్యోగ సంఘ అధ్యక్ష కార్యదర్శులు రవి, గణేశ్ పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం భూసేకరణ చేపట్టాలి



మాట్లాడుతున్న డైరెక్టర్ పీపీ గౌతమ్

జైపూర్: సింగరేణి పరిధిలో భూసేకరణ ప్రక్రియ నిబంధనల ప్రకారం చేపట్టాలని సింగరేణి సంస్థ సిబ్బంది, పరిపాలన, సంక్షేమ విభాగ డైరెక్టర్ గౌతమ్ పొట్రు అన్నారు. జైపూర్ మండల కేంద్రంలోని ఎస్టీపీపీ ప్రాణహిత అతిథి గృహంలో శనివారం మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్, పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్లు, ఎస్టేట్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ భూయాజమానులు, సింగరేణి సంస్థ సమన్వయంతో వ్యవహరించాలన్నారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా భూసేకరణ ప్రకియ నిర్వహించాలన్నారు.

నీటమునిగిన శ్మశానవాటిక



గోదావరి నీటిలో మునిగిన శ్మశానవాటిక

ఖానాపూర్: పట్టణంలోని గోదావరితీరంలో మున్సిపల్ నూతన కార్యవర్గం ఏర్పటయ్యాక రూ.50 లక్షలతో నిర్మించిన శ్మశనవాటిక ఏటా వర్షాకాలంలో నీట మునుగుతోంది. పాలకుల అనాలోచిత నిర్ణయాలతో ఏటా వరదలు తగ్గాక మరమ్మతు చేయడం పరిపాటిగా మారింది. శనివారం పట్టణంలోని 5వ వార్డులో ద్యావతి గంగాధర్(55) అనారోగ్యంతో మృతి చెందాడు. గోదావరి తీరంలో గల శ్మశానవాటికకు తీసుకెళ్లాల్సి ఉండగా ఉండగా కుటుంబ సభ్యులు అత్యంత దూరభారమైనప్పటికీ గాంధీనగర్ శివారులోని తర్లపాడ్ వెళ్లే రహదారి వరకు తీసుకెళ్లి ఖననం చేశారు. ఇప్పటికైనా శ్మశానవాటిక సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతుల నేపథ్యంలో పలు రైళ్లు రద్దు

ఆదిలాబాద్: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న రైలు పట్టాలను సరిచేస్తున్న నేపథ్యంలో పలు రైళ్లను పాక్షికంగా రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో హైదరాబాద్ డివిజన్ పరిధిలోని భిక్కనూరు-తల్మాడ సెక్షన్, అక్కన్నపేట-మెదక్ సెక్షన్‌లో రైలు పట్టాలపై భారీగా వరద నీరు ప్రవహించడంతో అక్కడ మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని తిరుపతి-ఆదిలాబాద్ మధ్య నడిచే కృష్ణా ఎక్స్‌ప్రెస్‌ను శనివారం చర్లపల్లి-ఆదిలాబాద్ మధ్య పాక్షికంగా రద్దు చేసినట్లు తెలిపారు. పర్లి-ఆదిలాబాద్ మధ్య నడిచే 77615 రైలు సర్వీస్, ఆదిలాబాద్-పూర్ణ మధ్య నడిచే 77616 రైల్ సర్వీసులు సెప్టెంబర్ 1న రద్దు చేసినట్లు వివరించారు. ఈ విషయాన్ని రైలు ప్రయాణికులు గమనించాలని సూచించారు.

‘నూతన జాతీయ విద్యావిధానాన్ని వ్యతిరేకించాలి’



మాట్లాడుతున్న ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ

మంచిర్యాలఅర్బన్: నూతన జాతీయ విద్యావిధానాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మాణం చేయాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. శనివారం మార్క్స్‌భవన్‌లో పీడీఎస్‌యూ రాష్ట్ర విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాతన పురాణాలపై ఆధారపడి నూతన జాతీయ విద్యావిధానాన్ని రాసినట్లు చెప్పుకుంటున్న బీజేపీ ప్రభుత్వం వర్ణ వ్యవస్థ ఆధారిత విద్యను అమలు పరిచేందుకు ఉవ్విళ్లూరుతోందని ఆరోపించారు. దేశంలో 10 లక్షల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, దేశ జీడీపీలో 2.5 శాతం మాత్రమే విద్యకు నిధులు కేటాయిస్తున్నారన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో 15శాతం నిధులు కేటాయిస్తామని చెప్పి మాటమార్చిందన్నారు. అంతకుముందు పీడీఎస్‌యూ జెండాను రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌వీ శ్రీకాంత్ ఎగురవేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నాగరాజు, తెలంగాణ అసిస్టెంట్ ప్రొఫెసర్ సరిత, ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్, పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి లాల్‌కుమార్, పీడీఎస్‌యూ జాతీయ నాయకులు మహేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మధు, రాజేశ్వర్, కిరణ్, సహాయ కార్యదర్శులు గౌతమ్‌కుమార్, మస్తాన్, నవీన్, అజయ్, తిరుపతి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రెడ్డి చరణ్, డి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు

మందమర్రిరూరల్: పట్టణంలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో శనివారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాలబాలికల హ్యాండ్‌బాల్ క్రీడా పోటీలు నిర్వహించారు. బాలికల జట్టులో గంగుబాయి, మౌనిక, వైష్ణవి, పార్వతి, జయశ్రీ, సహస్ర మోక్షిత, బాలుర జట్టులో సాత్విక్, రుత్విక్‌వర్మ, జాషువా, ప్రణయ్, వంశీ, పార్థు ఎంపికైనట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్ తెలిపారు. హైదరాబాద్‌లో ఆదివారం జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో క్రీడాకారులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కోచ్ సునార్కర్ అరవింద్, పీడీ సంతోష్, పీఈటీ రాధారాణి, సీనియర్ క్రీడాకారులు ప్రణయ్, సంజయ్, రఘు, వర్మ, అమూల్య, తదితరులు పాల్గొన్నారు.

లక్షలాది మంది జీవితాల్లో వెలుగులు



పుస్తకం ఆవిష్కరిస్తున్న ఎంపీ, కలెక్టర్, ఎస్పీ

జైనూర్: సద్గురు పూలాజీబాబా తన హితబోధనలతో లక్షలాది మంది జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ కాంతిలాల్ పాటిల్, ఎంపీ గోడం నగేష్ అన్నారు. శనివారం మండలంలోని పట్నాపూర్‌లోని సిద్ధేశ్వర సంస్థాన్‌లో పూలాజీబాబా 101వ జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహించారు. బాబా సమాధి మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాలను ఏకతాటిపై తీసుకువచ్చి ఆధ్యాత్మిక మార్గం వైపు నడిపించిన ఘనత బాబాకే దక్కుతుందన్నారు. తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ఎన్నో కుటుంబాలు బాబా చూపిన మార్గంలో నడుస్తున్నాయన్నారు. అనంతరం మాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే రచించిన బాబా చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కిన్వట్ ఎమ్మెల్యే భీంరావ్ కేరామ్, మహారాష్ట్ర మాజీమంత్రి శివాజీరావు, మాజీ ఎమ్మెల్యే ఉత్తంరావు ఇంగ్లే, మహారాష్ట్ర స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాందాస్, ఆసిఫాబాద్ నియోజక వర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్, ఆదిలాబాద్ గ్రంథాలయ చైర్మన్ నర్సయ్య, ఆదిలాబాద్ డీఎస్పీ రఘునాథ్, రెవెన్యూ జిల్లా అధికారి లోకేశ్వరరావు, విద్యుత్ శాఖ ఎస్సీ ఆడే శేషేరావు పాల్గొన్నారు.

ముగిసిన అభ్యంతరాల స్వీకరణ



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రసాద్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలో మండల స్థాయిలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు శనివారం ముగిసాయి. ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాలకు సంబంధించి అభ్యంతరాల స్వీకరణ సైతం ముగిసింది. జిల్లాలోని పలు గ్రామాల నుంచి 515 అభ్యంతరాలు వచ్చాయి. ఓటరు పోలింగ్ కేంద్రాలు, వార్డు మార్పు, తప్పిపోయిన ఓటరుకు సంబంధించి ఎక్కువగా వచ్చినట్లు తెలుస్తోంది. జన్నారం మండలంలో 23, దండేపల్లిలో 104, లక్సెట్టిపేటలో 30, హాజీపూర్‌లో 12, జైపూర్‌లో 88, భీమారంలో 58, చెన్నూర్‌లో 2, కోటపల్లిలో 3, వేమనపల్లిలో 1, మందమర్రిలో 18, కాసిపేటలో 93, బెల్లంపల్లిలో 27, తాండూర్‌లో 42, భీమినిలో 5, నెన్నెలలో 7, కన్నెపల్లిలో 2 అభ్యంతరాలకు సంబంధించి దరఖాస్తులు వచ్చాయి. కాగా, శనివారం హాజీపూర్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అన్ని పార్టీల ప్రతినిధులతో ఎంపీడీవో ప్రసాద్, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు దేశ్‌పాండే సమావేశం అయ్యారు.

15 లీటర్ల గుడుంబా స్వాధీనం



దాడులు నిర్వహిస్తున్న పోలీసులు

గుడిహత్నూర్: మండలంలోని నేరడిగొండ తండాలో శనివారం దాడులు నిర్వహించి 15 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. రాథోడ్ రమేశ్, రాథోడ్ రోహిదాస్, రాథోడ్ కృష్ణ, ఆడే లక్ష్మీబాయిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రెండు గ్రామాల్లో..

బోథ్: మండలంలోని నిగిని, కంటెగాం గ్రామాల్లో దాడులు నిర్వహించి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీసాయి తెలిపారు. నిగిని గ్రామంలో ఆడె గనియా ఇంట్లో లీటరు గుడుంబా, 19 కిలోల ఇప్పపువ్వు, కంటెగాంలో ఆడె దత్తు ఇంట్లో లీటరు గుడుంబా, 20 కిలోల ఇప్పపువ్వు, రాథోడ్ దత్తు ఇంట్లో లీటరు గుడుంబా, 25 కిలోల ఇప్పపువ్వు లభ్యమైనట్లు ఎస్సై తెలిపారు. వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

ఇచ్చోడ: మండలంలోని జామిడి, జల్దా, సిరిచెల్మ గ్రామాల్లోని గుడుంబా స్థావరాలపై శనివారం దాడులు నిర్వహించినట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు. జామిడిలో రాథోడ్ రాజు వద్ద 10 లీటర్ల నాటుసారా, జల్దాలోని పునీబాయి వద్ద 2 లీటర్లు, సిరిచెల్మలోని గుండాల బాపు వద్ద 2 లీటర్ల ఇప్పపువ్వు సారా స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అదుపుతప్పి ఆటో బోల్తా

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని ఖండాల అటవీ ప్రాంతంలో శనివారం అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. స్థానికులు, 108 సిబ్బంది తెలిపిన వివరాల మేరకు బేల మండలానికి చెందిన పలువురు ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పాటగూడలో జరిగే అంత్యక్రియలకు ఆటోలో బయలుదేరి వెళ్లారు. తిరుగుప్రయాణంలో ఖండాల అటవీ ప్రాంతంలో అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న పలువురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను 108లో జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించినట్లు ఈఎంటీ కార్తీక్ సింగ్, పైలట్ విఠల్ గౌడ్ తెలిపారు.

మార్కెటింగ్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



ఎస్పీ అఖిల్ మహాజన్

కైలాస్‌నగర్: మల్టీ లెవల్ మార్కెటింగ్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అమాయక ప్రజలను అధిక లాభాల ఆశ చూపి మోసం చేస్తున్న వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఉట్నూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బోయవాడకు చెందిన ఠాగూర్ విజయ్ సింగ్ myv3ads అనే అప్లికేషన్‌లో నమోదై దాని ద్వారా డబ్బులు సంపాదించవచ్చని ఆశ చూపి, అందులో నమోదయ్యేందుకు రూ.1,21,000 చెల్లించాలని ఇద్దరికి ఆశచూపి మోసం చేశాడన్నారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టి శుక్రవారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. ఇంకా ఈ అప్లికేషన్ ద్వారా మోసపోయిన బాధితులు ఎవరైనా ఉంటే నిర్భయంగా జిల్లా పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించవచ్చన్నారు.

భీమన్న ఆలయంలో చోరీ

సోన్: మండలంలోని కూచన్‌పల్లి గ్రామ సమీపంలో ఉన్న న్యాకపు కులస్తుల ఆరాధ్య దైవమైన భీమన్న ఆలయంలో గురువారం చోరీ జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శనివారం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై గోపి సంఘటన స్థలానికి చేరుకుని ఆలయ పూజారి దేశి నరును అడిగి తెలుసుకున్నారు. 40 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.2వేల నగదు చోరీకి గురైనట్లు తెలిపారు. గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.